సాక్షి
పెద్దపల్లి
గురువారం : 28 : డిసెంబర్ : 2023





## అయ్యప్ప ఆలయంలో పూజలు

జ్యోతినగర్ : ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ లోని అయ్యప్ప ఆలయంలో బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు.



## సమర్థవంతంగా 'ప్రజాపాలన'

రామగుండం: గ్రామాల్లో ప్రజాపాలన సభలను సమర్థవంతంగా నిర్వహిస్తామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.6/15.4

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం కొనసాగుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

# నల్లనేలపై ఎర్రజెండా



ఆర్జీ-1 ఏరియాలో సంబరాలు చేసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు



ఆర్జీ-2 ఏరియాలో..




- 'గుర్తింపు' ఎన్నికల్లో ఏఐటీయూసీ ఆధిపత్యం
- ఐఎన్‌టీయూసీతో హోరాహోరి పోరు
- ప్రాభవం కోల్పోయిన టీబీజీకేఎస్



బ్యాలెట్ బాక్స్‌లు తెరుస్తున్న అధికారులు



ఓటువేసి సిరా చుక్క చూపిస్తున్న మహిళా కార్మికులు

సాక్షి, పెద్దపల్లి: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కోసం బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ ముందంజలో నిలిచింది. సింగరేణి గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు బుధవారం అర్ధరాత్రి దాకా కొనసాగింది. తొలుత బోణీ కొట్టిన ఐఎన్‌టీయూసీ ఆరు ప్రాంతాల్లో, ఏఐటీయూసీ ఐదు ఏరియాల్లో విజయం సాధించి ప్రాతినిధ్యం దక్కించుకున్నాయి. అయితే, అత్యధిక ఓట్లు సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఆవిర్భవించింది. సింగరేణిలోని 11 ఏరియాల్లో 13 కార్మిక సంఘాలు పోటీచేయగా కేవలం సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ మధ్యే పోటీ కనిపించింది. బుధవారం అర్ధరాత్రి వరకు సాగిన ఓట్ల లెక్కింపు వివరాలు ఇలా.. ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం కార్పొరేట్, ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, రామగుండం 3, భూపాలపల్లిలో ఏరియాలో ప్రాతినిధ్యసంఘంగా గెలుపొందింది. ఇక ఏఐటీయూసీ యూనియన్ రామగుండం -1, రామగుండం -2, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా మొత్తం 5 చోట్ల విజయం సాధించింది. మొత్తానికి సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ విజయబావుటా ఎగురవేసింది. పోటీచేసిన 11 స్థానాల్లో ఐఎన్‌టీయూసీకి 6 స్థానాల్లో మొత్తం: 14,215 ఓట్లు రాగా, ఏఐటీయూసీకి 5 స్థానాల్లో మొత్తం 16,177 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఓట్లు ఇతర యూనియన్లు పంచుకున్నాయి. కాగా, గత రెండు పర్యాయాలు పోలింగ్‌లో సత్తా చాటిన టీజీబీకేఎస్ ఈసారి ఎన్నికల్లో పూర్తిగా డీలా పడిపోయింది.

### ఏరియాల వారీగా విజేతల వివరాలు..

| యూనియన్ | సాధించిన ఓట్లు | మెజారిటీ |
|---|---|---|
| **ఆర్జీ-1లో విజేత ఏఐటీయూసీ** | | |
| ఏఐటీయూసీ | 1,983 | 417 |
| ఐఎన్‌టీయూసీ | 1,566 | |
| సీఐటీయూ | 1,115 | |
| **ఆర్జీ-2 ఏరియాలో విజేత ఏఐటీయూసీ** | | |
| ఏఐటీయూసీ | 1,357 | 334 |
| ఐఎన్‌టీయూసీ | 1,024 | |
| సీఐటీయూ | 666 | |
| **ఆర్జీ-3 ఏరియాలో విజేత ఐఎన్‌టీయూసీ** | | |
| ఐఎన్‌టీయూసీ | 1,360 | 104 |
| ఏఐటీయూసీ | 1,256 | |
| సీఐటీయూ | 656 | |



సిరా చుక్క చూపిస్తున్న కార్మికులు

### ఎగిరిన ఎర్రజెండా..

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రెండు ఏరియాల్లో విజయం సాధించింది. ఒక ఏరియాలో ఐఎన్‌టీయూసీ గెలుపొందింది. రామగుండం రీజియన్‌లో మూడు ఏరియాలు ఉండగా అందులో రెండింటిలో ఏఐటీయూసీ జయకేతనం ఎగురవేసింది. ఆర్జీ-1 ఏరియాలో 5,044ఓట్లు పోల్‌కాగా అందులో 1,983 ఓట్లు సాధించి ఏఐటీయూసీ గెలిచింది. 1,566 ఓట్లతో ఐఎన్‌టీయూసీ రెండో స్థానంలో నిలిచింది. ఆర్జీ-2 ఏరియాలో 3,369ఓట్లు పోల్‌కాగా అందులో 1,357ఓట్లు సాధించి ఏఐటీయూసీ విజయం సాధించగా, ఐఎన్‌టీయూసీ 1,024ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఆర్జీ-3 ఏరియాలో 3,612 ఓట్లు పోల్‌కాగా అందులో ఐఎన్‌టీయూసీ 1,360 ఓట్లు సాధించి విజయం కైవసం చేసుకుంది. 1256ఓట్లు సాధించి ఏఐటీయూసీ రెండోస్థానంలో నిలిచింది. ఈసారి సీఐటీయూ ఓటు బ్యాంకు పెంచుకుంది. మూడు ఏరియాల్లో మంచి గెలిచిన సంఘాలకు పోటీ ఇచ్చింది. మూడోస్థానంలో నిలిచింది.

### 93శాతం పోలింగ్ నమోదు

రామగుండంలో పోలింగ్ తీరు ఇలా..

| ఏరియా | కార్మికులు | పోలింగ్ | శాతం |
|---|---|---|---|
| ఆర్జీ-1 | 5,384 | 5,044 | 93.70 |
| ఆర్జీ-2 | 3,556 | 3,369 | 94.74 |
| ఆర్జీ-3 | 3,884 | 3,612 | 93.00 |

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచే కార్మికులు ఓటువేసేందుకు గనులు, డిపార్టుమెంట్ల వద్ద బారులు తీరారు. ఆయా యూ నియన్ల నాయకులు కార్మికులను కలుసుకుంటూ తమకే ఓటు వేయాలని కోరారు. రామగుండంలోని ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో 12,824మంది కార్మికులు ఉండగా, 12,025 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జీఎంలు, అధికారులు ఓటింగ్ సరళి పర్యవేక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో పో లింగ్ కొనసాగింది. ఆర్జీ-1, 2 జీఎంలు శ్రీని వాస్, సూర్యనారాయణ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. గోదావరిఖని ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐ ప్రమోద్ రావు, వేణుగోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 23 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళి కొనసాగింది. ఓటింగ్ అనంతరం బ్యాలెట్ బ్యాక్సులను ఆర్జీ-1 ఏరియా కమ్యూనిటీహాల్ లెక్కింపు కేంద్రానికి తరలించారు. పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తనిఖీ చేశారు. తహసీల్దార్ కుమారస్వామి, అధికారులు ఉన్నారు.

**పోటెత్తిన కార్మికులు**

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. మహిళా కార్మికులు కూడా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

**ఆర్జీ-3లో 93 శాతం పోలింగ్..**

రామగిరి(మంథని): ఆర్జీ-3లోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో 3,612 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గోదావరిఖని ఏసీపీ శ్రీనివాసరావు బందోబస్తు చేపట్టారు. జీఎం కార్యాలయంలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న బెల్లం శ్రీను, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న జ్యోతి భార్యాభర్తలు. వీరిద్దరూ తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

## న్యూస్‌రీల్

### ఎన్టీపీసీ సందర్శన



శరవణన్

జ్యోతినగర్(రామగుడం): సీఐఎస్‌ఎఫ్ ఐజీ ఎస్ఆర్ శరవణన్ బుధవారం ఎన్టీపీసీని సందర్శించారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్ చేరుకున్న ఆయనకు అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రాజెక్టును సందర్శించారు. భద్రత, రక్షణ చర్యలను పరిశీలించారు. మల్కాపూర్ బ్యారక్స్ సందర్శించారు.

### బల్దియాలో నేటినుంచి సభలు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో గురువారం నుంచి ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించనున్నారు. తొలిరోజు 1వ డివిజన్ విలేజీ రామగుండం జెడ్పీహెచ్‌ఎస్, 2వ డివిజన్ పీకేరామయ్య కాలనీ సెంటర్, 3వ డివిజన్ అంబేడ్కర్ భవన్, 29వ డివిజన్ బాపూజీనగర్ జెండా వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సభలు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు 5వ డివిజన్ శాలపల్లి అంబేడ్కర్ భవన్, ప్రశాంత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం, 6వ డివిజన్ సప్తగిరికాలనీలోని వినాయక మండపం గ్రౌండ్, 7వ డివిజన్ ఉదయ్‌నగర్‌లోని గణేశ్ మండపం, 8వ డివిజన్ గంగానగర్‌లోని వినాయక మండపం వద్ద వార్డు సభలను నిర్వహించన్నుట్లు ఆయన వెల్లడించారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు

**'ప్రజాపాలన'పై నిర్లక్ష్యం వద్దు**

- 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తాం
- ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వానికి బాసటగా నిలవాలి
- రేషన్ బియ్యం రీసైకిలింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తాం
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా 6 గ్యారంటీలను అమలు చేస్తామని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన గ్రామ, వార్డుసభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గ్యారంటీల అమలులో ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, ఒక గ్రామంలో ఏర్పాటు చేసిన కౌంటర్ 10 రోజులపాటు ఉంటుందని, దరఖాస్తుదారులు వీలైన రోజు అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను డిజిటలైజ్ చేయాలని ఆయన సూచించారు.

**ఫారాలను ముందే ఇవ్వండి**

దరఖాస్తు ఫారాలను ముందుగానే ఇస్తే లబ్ధిదారులు వాటిని నింపి, తీసుకువస్తారని, ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, తోపులాట జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై కఠినంగా వ్యవరిస్తామన్నారు. సమావేశంలో కరీంనగర్ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్ కుమార్, చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తులను తిరస్కరించవద్దు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశాం. మిగతా నాలుగింటిని తప్పకుండా అమలు చేస్తాం. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ఏ ఒక్క దరఖాస్తును అధికారులు తిరస్కరించవద్దు.

– మంత్రి పొన్నం ప్రభాకర్

**పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యం**

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది. ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద రోజుల్లో అమలు చేసి చూపిస్తాం. అధికారులు ప్రతీ కౌంటర్ వద్ద నిర్లక్ష్యరాస్యుల కోసం సహాయకులను నియమించాలి. ప్రజలు అధిక సంఖ్యలో వస్తే టోకెన్లు ఇవ్వాలి.

– మంత్రి శ్రీధర్‌బాబు

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నల వర్షం**

- సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్‌కుమార్, పాడి కౌశిక్ రెడ్డిలు అందరి కంటే ముందే వచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అధికారులతో వేదిక కింద కూర్చున్నారు.
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇది వరకు అర్జీ పెట్టుకున్నవారు మళ్లీ చేసుకోవాలా? అని ప్రశ్నించడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. వారు అర్హులేనని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. పెంచిన పింఛన్లనూ అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి అధికారులు అడ్డు చెబుతున్నారని, స్పష్టత ఇవ్వాలన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో మాట్లాడి చెబుతామని అన్నారు.
- సమావేశానికి మాజీ మంత్రులు, సిరిసిల్ల, కరీంనగర్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్ గైర్హాజరయ్యారు.



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

### విద్యాభివృద్ధికి పటిష్ట చర్యలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లోని కిచెన్‌గార్డెన్, పాఠశాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, కిచెన్‌గార్డెన్, ఉన్నతి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థితో కలెక్టర్ మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న ఇంటర్నెట్‌ను వినియోగించి సమాజంలో వస్తున్న మార్పులు, మార్కెట్‌లో వస్తున్న నూతన టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. పాఠశాలలో ప్రణాళికబద్ధంగా బోధన చేపట్టాలని, ప్రతీ ఉపాధ్యాయుడు బోధించాల్సిన పాఠ్యాంశాలపై వార్షిక, నెలవారీ ప్రణాళికలను తయారు చేసుకుని టీఎంఎల్ ప్రకారం కట్టుదిట్టంగా విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధన చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని, వంద శాతం హాజరు లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ప్రతీనెల మూడో శనివారం నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యాబోధనపై డెమో నిర్వహించడంతోపాటు ఇంటివద్ద పిల్లలు కొంతసమయం చదువుపై దృష్టి సారించేలా చూడాలని ఆయన అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల పరంపర

- పెరిగిన రోడ్డు యాక్సిడెంట్లు
- రక్తసిక్తమైన రాజీవ్ రహదారి
- జిల్లాలో 19 బ్లాక్‌స్పాట్ల గుర్తింపు
- ఎక్కడా కనిపించని హెచ్చరిక బోర్డులు

రోడ్డు ప్రమాదాలు.. ప్రధానంగా రాజీవ్ రహదారిపై వీటి పరంపర ఆందోళన కలిగిస్తోంది. యాక్సిడెంట్ల నియంత్రణకు అధికార యంత్రాంగం తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడం, వాహనదారుల అతివేగం, నిర్లక్ష్యం, రోడ్డు నిర్మాణంలో లోపాలు ప్రమాదాలకు కారణాలుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాదిలో చోటుచేసుకున్న ప్రమాదాలపై అవలోకనం..








జ్యోతినగర్ : ఎన్టీపీసీలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాలు(ఫైల్)



కాట్నపల్లిలో దగ్ధమవుతున్న లారీలు(ఫైల్)

గోదావరిఖని: రాజీవ్ రహదారిపై ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. పోలీసు, రోడ్డు రవాణా, ఇతర అధికార యంత్రాంగం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా యాక్సిడెంట్లు ఆగడంలేదు. గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల(బ్లాక్‌స్పాట్స్) వద్ద వీటి పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రమాదాల నియంత్రణకు బ్లాక్‌స్పాట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మితిమీరిన వేగం, తొందరపాటుతనం, వాహనదారుల నిర్లక్ష్యంతో ఏటా వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది.

**నిర్మాణంలోనూ లోపాలు..**

- సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి శివారులో జిల్లా పరిధి ప్రారంభమవుతుంది.
- రామగుండం – గోదావరిఖని సమీపంలోని గోదావరి వంతెన వరకు రాజీవ్ రహదారి విస్తరించి ఉంది.
- రాజీవ్ రోడ్డు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని అప్పట్లోనే నిపుణులు తేల్చారు.
- ప్రధానంగా గోదావరిఖని జీఎం కార్యాలయం మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా మారిందని గురించారు.
- ఇక్కడ భారీ వాహనాలు, ప్రధానంగా లారీలు బోల్తాపడ్డ సంఘటనలు వందల్లో నమోదవుతున్నాయి.
- చాలామంది గాయాల పాలుకాగా, అనేక మంది మృత్యువాతపడ్డారు.
- అలాగే గోదావరిఖని గంగానగర్ ఫ్లైఓవర్, ఎన్టీపీసీ లేబర్‌గేట్, బసంత్‌నగర్ రైల్వే ఫ్లైఓవర్, కాట్నపల్లి, చిన్నకల్వల పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు.
- కాట్నపల్లి సమీపంలో ఈ ఏడాదిలో రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో వాటిలో మంటలు అంటుకుని డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకుని సజీవదహనమయ్యాడు.
- ఇలాంటి సంఘటనలు ఈ ఏడాది జిల్లాలో చాలానే చోటుచేసుకున్నాయి.

**అప్రమత్తతే నివారణకు మార్గాలు..**

రాజీవ్ రహదారిపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు, నిపుణులు సూచిస్తున్నారు. నిర్దేశిత 80 కి.మీ. వేగంతో వెళ్లే సమయంలో జాగ్రత్తగా వాహనాలు నడిపించాలని పేర్కొంటున్నారు. ఇలాగైతేనే క్షేమంగా గమ్యస్థానం చేరుకుంటారని అంటున్నారు. ప్రధానంగా బ్లాక్‌స్పాట్ల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణతోపాటు మరణాల సంఖ్య తగ్గించే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు.

**కనిపించని హెచ్చరిక బోర్డులు**

- జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించిన అధికారులు.. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు వేగంగా వెళ్లే సమయంలో హెచ్చరించే బోర్డులు సరిగా ఏర్పాటు చేయడం లేదు.
- అతిసమీపంలోకి వచ్చేదాకా ప్రమాదకర ప్రాంతాలు వాహనదారులకు కనిపించడంలేదు.
- వాహనదారులు అప్రమత్తమైయ్యేలోపే జరగాల్సిన ప్రమాదాలు జరుగిపోతున్నాయని అధికారులు గుర్తించారు.
- పోలీసు, ఇతర అధికార యంత్రాంగం స్పందించి బ్లాక్ స్పాట్ల వద్ద కి.మీ. ముందు నుంచే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు పేర్కొంటున్నారు.

### 2023లో చోటుచేసుకున్న ప్రమాదాలు

| | |
|---|---|
| మొత్తం ప్రమాదాలు | 335 |
| ప్రాణంతకమైనవి | 102 |
| మామూలు వద్ద జరిగినవి | 233 |
| మృతుల సంఖ్య | 101 |
| గాయపడినవారు | 342 |

### జిల్లాలో బ్లాక్‌స్పాట్లు ఇవే..

| ప్రాంతం | బ్లాక్‌స్పాట్ ఉన్నచోటు |
|---|---|
| పెద్దపల్లి | బందంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి |
| పెద్దపల్లి | అప్పన్నపేట బస్టాండ్ |
| రామగుండం | కుందనపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి |
| రామగుండం | ఐవోసీ బంక్ ఏరియా |
| జ్యోతినగర్ | మేడిపల్లి సెంటర్ |
| జ్యోతినగర్ | ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు |
| గోదావరిఖని | సింగరేణి బీ- గెస్ట్‌హౌస్ మూలమలుపు |
| గోదావరిఖని | బంగ్లాస్ ఏరియా |
| గోదావరిఖని | గోదావరి బ్రిడ్జి ఫ్లైఓవర్ |
| సుల్తానాబాద్ | దుబ్బపల్లి |
| సుల్తానాబాద్ | గర్రెపల్లి స్టేజీ |
| సుల్తానాబాద్ | నర్సయ్యపల్లి క్రాస్ రోడ్డు |
| సుల్తానాబాద్ | కాట్నపల్లి |
| సుల్తానాబాద్ | సుల్తానాబాద్ |
| సుల్తానాబాద్ | సుగ్లాంపల్లి స్టేజీ |
| సుల్తానాబాద్ | చిన్నకల్వల పెట్రోల్‌బంక్ |
| పెద్దపల్లి | పెద్దకల్వల |
| పెద్దపల్లి | రంగంపల్లి పెట్రోల్‌బంక్ |
| పెద్దపల్లి | పెద్దపల్లి బస్టాండ్ ఏరియా |

## క్లుప్తంగా

### పేదలకు అండగా లయన్స్ క్లబ్



పిన్ అందిస్తున్న రాజిరెడ్డి

కోల్‌సిటీ(రామగుండం): పేదల అభ్యున్నతికి లయన్స్ క్లబ్ సామాజిక సేవలు అందిస్తోందని ఆ సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి అన్నా రు. గోదావరిఖని శ్రీనగర్ కాలనీలోని లయన్స్ క్లబ్ భవన్‌లో మంగళవారం రాత్రి మగువ లయన్స్ క్లబ్ 3వ చార్టర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సామాజిక సేవలందిస్తున్న మగువ లయన్స్ క్లబ్ ప్రతినిధులను డిస్ట్రిక్ట్ గవర్నర్‌తోపాటు డిస్ట్రిక్ట్ కమిటీ, జోనల్ చైర్మన్ ప్రతినిధిలు అభినందించారు. మగువ లయన్స్ క్లబ్ ప్రతినిధులకు డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పిన్‌ను బహూకరించారు. అలాగే కొత్తగా ఏర్పడిన లియో లయన్స్ క్లబ్ ప్రతినిధులకు కూడా లయన్ పిన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి వెంకట రమణారెడ్డి, కోశాధికారి సామ రాజేంద్రప్రసాద్, రీజియన్ చైర్మన్ ఊట్ల అశోక్‌కుమార్, తిలక్ చక్రవర్తి, జోన్ చైర్మన్ సోమవారపు లావణ్య, సంక్షేమ, సూర్యదేవర జ్యోతి, బీనా సింగ్, మగువ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి టి.లక్ష్మీవాణి, జి.సునీత, కోశాధికారి ఎ.శశికళ పాల్గొన్నారు.

### మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. బుధవారం మల్లన్న దర్శనం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు పలుప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఒగ్గ పూజారులచే స్వామివారికి పట్నాలతో పాటు బోనాలు చెల్లించారు. తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, ఈవో సదయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వైభవంగా మండల పూజ



రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి మణికంఠుడి మండల పూజ వైభవంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు కార్పొరేటర్ కౌశిక లత–హరి, జెన్‌కో ఉద్యోగి లగిశెట్టి రవికుమార్–స్వప్న దంపతులు తదితరులు పాల్గొన్నారు.

### 28న మహా పడిపూజ

ధర్మారం: ధర్మారంలోని బోడగుట్టపై నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 28న మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటిపెల్లి ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో కేరళ తాంత్రికులు ఉన్నికృష్ణ నంబూద్రితో పాటు స్థానిక పూజారులు పాల్గొననున్నారు. ఉదయం గణపతి హోమం, మహాభిషేకం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని, పడిపూజ అగ్నిగుండాలతో వేడుకలు ముగుస్తాయని తాటిపెల్లి ఈశ్వర్ వెల్లడించారు.

# సింగరేణిలో 'గుర్తింపు' సందడి



ఓటుహక్కు వినియోగించుకున్న కార్మికులు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా బుధవారం రామగుండం పరిధిలోని ఆర్జీ–1,2,3 ఏరియాల్లో సందడి నెలకొంది. రీజియన్ల పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా జరగ్గా.. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటు వేసేందుకు బారులు తీరారు. కొందరు ఓటువేసి విధుల్లో పాల్గొన్నారు. మహిళా కార్మికులు సైతం ఉత్సాహంగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గనులు, డిపార్ట్‌మెంట్‌లకు చెందిన కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోగా.. ఏసీపీ తులా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – గోదావరిఖని/సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఓటు వేసిన అనంతరం గనిలోకి వెళ్తున్న కార్మికులు



గడియారానికి ఓటేయాలని అభ్యర్థిస్తూ..



భద్రతను పరిశీలిస్తున్న ఏసీపీ తులా శ్రీనివాస్



బ్యాలెట్ బాక్సులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



గోదావరిఖనిలో పోలింగ్ కేంద్రం వద్ద కార్మికుల సందడి

# దరఖాస్తులకు వేళాయె

- నేటి నుంచి జనవరి 6వరకు ప్రజాపాలన
- గ్యారంటీ స్కీంలకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా..
- ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో గ్రామసభల నిర్వహణ
- సజావుగా సాగేలా ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి/సుల్తానాబాద్: సంక్షేమ పథకాల లబ్ధిదారులను, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నేటినుంచి జనవరి 6 వరకు 8రోజులపాటు గ్రామాల్లో, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. ఇందుకోసం ప్రతీ వంద కుటుంబాలకు ఒక్కకౌంటర్‌ను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు. గ్రామసభలు జరిగే ప్రాంతాల్లో ముందురోజే దండోరాల ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించేలా జిల్లాయంత్రాంగం ఏర్పాట్లను చేసింది. గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోని వారు ప్రజాపాలన జరిగే 8రోజుల్లో తమ పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

**43 బృందాలు.. 380 గ్రామసభలు**

జిల్లాలోని 266 జీపీలు, నాలుగు మున్సిపాలిటీల్లోని 114వార్డుల్లో 8రోజుల పాటు ఉదయం 8నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజా సదస్సులను నిర్వహిస్తారు. ప్రతీ మండలంలో తసీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపాలిటీలో కమిషనర్ ఆధ్వర్యంలో రెండు బృందాలు రోజుకు రెండు చోట్ల షిఫ్టుల్లో దరఖాస్తులు స్వీకరించేలా అధికారుల ఏర్పాట్లు పూర్తి చేశారు.

**గ్యారంటీల అమలు కోసం**

ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులను పూరించి, వాటిని అక్కడ ప్రతి వందమంది దరఖాస్తుదారులకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, తెల్లరేషన్ కార్డు వంటి జిరాక్స్ ప్రతులను జతచేయాల్సి ఉంటుంది. ప్రతీ దరఖాస్తును ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదుచేయడంతో పాటు, ప్రతీ దరఖాస్తుకు ఒక ప్రత్యేక నంబరు కేటాయించి రసీదును అందించనున్నారు. గ్రామసభల నిర్వహణలో శాంతిభద్రతల విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తుతో పాటు, ఆయా కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, టేబుళ్లు, క్యూలైన్ల కోసం బారికేడ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రచారం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

**ఎవరు ఎక్కడ పాల్గొంటారంటే..**

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు ఉదయం 8గంటలకు సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారు. తదుపరి 10గంటలకు పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామసభలో, మధ్యాహ్నం 2గంటలకు సుల్తానాబాద్‌లోని చిన్న బొంకూర్ గ్రామసభలో పాల్గొంటారు.
- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ గోదావరిఖనిలోని బాబూజీనగర్‌లో నిర్వహించే వార్డుసభలో ఉదయం 8.30 పాల్గొననున్నారు. మధ్యాహ్నం పాలకుర్తి మండలం జీపీ కార్యాలయంలో, రామారావుపల్లి గ్రామంలో పాల్గొంటారు.
- కమాన్‌పూర్ మండలంలోని గుండారం గ్రామసభలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఉదయం 8గంటలకు పాల్గొంటారు. అనంతరం మంథనిలోని చైతన్యపురి కాలనీలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు.
- పెద్దపల్లి మున్సిపాలిటీలోని 1,2,3వార్డులో నిర్వహించే కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పాల్గొననున్నారు.

# ప్రజాపాలన వార్డుసభలకు సహకరించండి

- మేయర్ బంగి అనిల్‌కుమార్
- అంగన్‌వాడీ, ఆర్పీలకు అవగాహన సదస్సు



కోల్‌సిటీ(రామగుండం): ప్రజాపాలక వార్డు సభలకు సహకరించాలని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్ కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్‌తో కలిసి బుధవారం సాయంత్రం బల్దియా సిబ్బంది, అంగన్‌వాడీ, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన వార్డు సభలను 50 డివిజన్లలో నిర్వహించనున్నట్లు మేయర్ తెలిపారు. వార్డు సభలు నిర్వహించే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలో కేటాయించిన సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ వార్డు సభల్లో మహాలక్ష్మీ పథకం, రైతు భరోసా పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ పథకం, చేయూత పథకానికి అర్హులైన వారు సమర్పించే దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నాలుగు డివిజన్లలో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో నాలుగు డివిజన్ల చొప్పున వార్డుసభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ వార్డు సభల్లో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొంటారని, వార్డు సభకు ముందుగానే ఏరియా బిల్ కలెక్టర్, మహిళా సంఘం ఆర్పీలు, అంగన్‌వాడీల దగ్గర ఉచితంగా దరఖాస్తు ఫారాలను పొందాలని ప్రజలకు సూచించారు. దరఖాస్తు ఫారాలను పూరించి ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి ప్రజాపాలన వార్డు సభలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, మెప్మా పీడీ రజిని తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ ఫీజు తగ్గేనా?

- విన్నవిస్తున్న వ్యాపారులు
- మందగించిన చెల్లింపులు



పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీలో వ్యాపారుల నుంచి వసూలు చేసే ట్రేడ్ లైసెన్స్ ఫీజు పెంపుపై నెలకొన్న సందిగ్ధం ఏళ్ల గడుస్తున్నా తొలగిపోవడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు అడ్డగోలుగా పెంచారని వ్యాపారులు అప్పట్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల ఆందోళనకు అండగా నిలిచిన కాంగ్రెస్ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు ఫీజు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో తమకు ఇచ్చిన హామీ మేరకు ఫీజు తగ్గిస్తారనే ఆశతో వ్యాపారులు ఉన్నారు.

**15శాతం చేరని వసూళ్లు..**

- మున్సిపాలిటీ పరిధిలో 846మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ పొంది ఉన్నారు.
- వారినుంచి ఏటా రూ.22.78లక్షల ఫీజు వసూలు కావాల్సి ఉంది.
- అయితే ఫీజు అడ్డగోలుగా పెంచడంతో తాము చెల్లించబోమని వ్యాపారులు తెగేసి చెప్పారు.
- వీరి ఆందోళనలకు కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలవడంతో చెల్లింపులు ఆగిపోయాయి.
- ఫలితంగా ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం రూ.4.96లక్షలే లైసెన్స్ ఫీజు వసూలైందని, ఇది 15శాతం కూడా మించలేదని అధికారులు చెబుతున్నారు.
- వీటికితోడు బకాయిలు రూ.6.51లక్షలు ఉన్నాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి.
- బకాయిలపై జరిమానా విధిస్తుండడంతో ఆ భారం రూ.2.54లక్షలకు చేరిందని పడిందని వివరించాయి.

**కమిషనరేట్‌లోనే పెండింగ్**

పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్ ఫీజు తగ్గింపు విషయమై చైర్‌పర్సన్ మమతారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు తీర్మానించి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఆ తీర్మానంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఫీజు తగ్గలేదని కాలేదని తెలుస్తోంది. అడ్డగోలుగా పెంచిన ఫీజు తగ్గించే దాకా తాము ఫీజు చెల్లించ బోమని వ్యాపారులు భీష్మించుకు కూర్చున్నారు. ఇలాంటి పరిస్థితే సుల్తానాబాద్ మున్సిపాలిటీలోనూ నెలకొంది. పెంచిన ట్రేడ్‌లైసెన్సు ఫీజు తగ్గించాలని అక్కడి వ్యాపారులు కూడా కోరుతున్నారు.


**నివేదించాం**



వ్యాపారులు చెల్లించే ట్రేడ్‌లైసెన్సు ఫీజు తగ్గించాలంటూ ఉన్నతాధికారులకు నివేదించాం. అయితే ఆన్‌లైన్‌లో తగ్గింపు విషయమై ఆప్షన్ అప్‌డేట్ కాని కారణంగానే తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే నిర్ణయానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

–ఆకుల వెంకటేశ్, కమిషనర్, పెద్దపల్లి

**ఆందోళన వద్దు.. తగ్గిస్తా**



నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్‌లైసెన్సు పొందిన వ్యాపారులపై పెంచిన ఫీజుల భారాన్ని తగ్గిస్తా. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగ్గించేలా ఒప్పిస్తా. వ్యాపారులు ఆందోళన పడొద్దు.

–విజయరమణారావు, ఎమ్మెల్యే పెద్దపల్లి

# వంద కుటుంబాలకో కౌంటర్ ఏర్పాటు చేశాం



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రజాపాలన గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ప్రతీ 100 కుటుంబాలకో కౌంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. నిరక్షరాస్యులు ఆందోళన పడకుండా వారికి సాయం అందించేందుకు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తను నియమించినట్టు తెలిపారు. వృద్ధులు, మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామసభలో అందిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తామని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు అందరూ గ్రామసభలు, వార్డు సభల ద్వారా అధికారులకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఇందులో ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ చెప్పారు. స్వీకరించిన అర్జీల వివరాలను వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వెల్లడించారు. ఈ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టం బూడిదపాలు!

- అనుమానాస్పద స్థితిలో వరికుప్పలు దగ్ధం



ఆదుకోవాలని వేడుకుంటున్న రైతు దంపతులు

కాల్వశ్రీరాంపూర్: ఆరుగాలం కష్టపడ్డారు. పంట చేతికొచ్చింది. కోపిద్దామంటే హార్వెస్టర్‌కు డబ్బులు చెల్లించేంత స్థోమత లేదు. దీంతో కోసిన పంటను రోడ్డుపై వేశారు. వాహనాల తాకిడికి ధాన్యం గింజలు రాలుతాయని భావించారు. మంగళవారం రాత్రి ఆ వరికుప్పలకు నిప్పు అంటుకుంది. వరిధాన్యం కాలి బూడిదయ్యింది. ఈ ఘటన మండలంలోని వెన్నంపల్లిలో చోటు చేసుకుంది. బాధిత రైతు తాటికంటి సమ్మయ్య వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సమ్మయ్య గ్రామంలో తెలిసిన వారి భూమి కౌలుకు తీసుకుని వరిపంట వేశాడు. వరి కోతకు రాగా హార్వెస్టర్‌తో కోపిచ్చేంత స్థోమత లేదు. దీంతో సమ్మయ్య దంపతులు చేతితో కోసిన వరిని కట్టలుగా కట్టి రోడ్డుపై వేశారు. వచ్చిపోయే లారీలు, వాహనాలు తాకిడికి గింజలు రాలుతాయని తదుపరి తూర్పార పట్టుకుంటే కొంతఖర్చు తగ్గుతుందని ఆశించారు. ఇంతలో మంగళవారం రాత్రి వరికుప్పలు దగ్ధం అయ్యాయి. బుధవారం సమ్మయ్య దంపతులు వెళ్లి చూసేసరికి పంట మొత్తం కాలి బూడిదైంది. అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టామని, ఆరుగాలం కష్టం బూడిదయ్యిందని బోరున విలపించారు. రూ.80వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



చలికి చచ్చిపోతున్న నారు



## చలికి చచ్చిపోతోంది

ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో యాసంగికి సిద్ధం అవుతున్న రైతన్నకు చలి తీవ్రత గుదిబండలా మారింది. గంపెడాశలతో మొలక అలుకుడు చేసిన రైతుకు ఆదిలోనే చలిధాటికి నారు చచ్చుబడుతుండడంతో రైతు దిగాలు చెందుతున్నాడు. మనుషులు, జీవరాశులతో పాటు పంటలను సైతం భయపెడుతోంది చలిపంజా. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల శివారులో నారుమడిలో నారుపెరగక చచ్చుబడి 'సాక్షి' కెమెరాకు కనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి